# వచ్చేశా మోచ్! బారేజ్ కట్టడానికి..



మేమంతా ఏలూర్లోనే వున్నాం అనుకుంటున్నారా? ఇంకా నయం! మా పాతింటికి వెళ్లి అడిగారు కారు! అవునూ. మాకు ట్రాన్స్ఫరై పోయిందని మీకెలా తెలుస్తుందీ మేం ఎవరికీ చెప్ప కుండా వచ్చేస్తేనూ! మా పెద్ద పరీక్షలయిపోయాక ఇంటిల్లిపాదిమీ పిన్ని పెళ్లని చెప్పి కొవ్వూరెళ్లాం కదా! పెళ్లివారి బండటు వెళ్లిందో లేదో ఇటు ఏలూరు మావయ్యగారి దగ్గిర్నించి టెలిగ్రాం! మాకు బెజవాడ

ట్రాన్స్ఫరైంది కాబట్టి నాన్నని అర్జెంటుగా రమ్మని.

అసలూ పెళ్ళికి వెళ్ళేముందు నించీ అమ్మకు అనుమానంగానే వున్నట్లుంది. నాన్నతో ఒకటి రెండు సార్లంది కూడానూ ! "ఆస్పత్రి కట్టడం పూర్తయిపోయి డాక్టర్లూ నర్సులూ అటు ఇటు తిరగడంమొదలెట్టాక కూడా కూచోబెట్టి జీతం ఇవ్వడానికి మీ కంపెనీవాళ్ళేమన్నా వెర్రివెంగళప్పలా ! బెజవాడ ట్రాన్స్ఫరెటూ తప్పదూ ! నేను సామానంతా సర్దేసిపెళ్ళికెడతానూ !" అని.

కానీ అమ్మ చెప్పింది నాన్న ఏనాడు ముద్దుగా విన్నారు కనక ! కంపెనీ వాళ్ళిచ్చే ప్రతి రూపాయికీ వంద రూపాయల అరవ చాకిరీ చేయించుకుంటారని తనకి తెలియద్దూ (ఆఫీసు నిండా అరవ్వాళ్ళే కదా మరి!) అమ్మ మాట నాన్న వినకపోడం మూలాన్నే మా నలుగురినీ, పెళ్ళిలో అలిసి పులుసు కూరై పోయిన అమ్మమ్మ ప్రాణాలకి పడేసి వాళ్ళిద్దరూ ఏలూరెళ్ళాల్సొచ్చింది. సామానంతా కంపెనీ లారీలో బెజవాడ పంపేసి మూడో రోజు కల్లా చక్కావచ్చారనుకో ! కాళ్ళా చేతలా అడ్డం బడేందుకు మేం లేకపోబట్టి పని సుళువుగా అయిపోయిందిటలే ! కానీ ఎవ్వరికీ చెప్పకుండా దొంగలా ఏలూరొదిలేయాల్సొచ్చింది. ఒక్క సువర్ణకి మాత్రం అమ్మతో చేతుత్తరం పంపాం నేనూ చిన్నారీ. తను దసరా సెలవల్లో బెజవాడ తప్పకుండా వస్తానని అమ్మతో చెప్పిందిట.

అసలేవైశాఖ మాసం. పైగా బెజవాడ ప్రయాణం. అందులో చిన్న పిల్లలం. గాడ్పులు కొట్టవూ ! అందుకని పొద్దున్నే మాకు అన్నాలు పెట్టి మరీ రైలెక్కించారు. దార్లోకని కొంచెం పెరుగన్నం కూడా కలిపిచ్చింది అమ్మమ్మ. దొడ్లో కాసిన నారింజ కాయలు కొంచెం బెల్లం ముక్క అమ్మ చేతికిచ్చింది. ఎండ మరీ ఎక్కువగా వుంటే తలా ముక్క పెట్టమని.

తీరా బయల్దేరే ముందు వాళ్ళమ్మని పట్టుకుని ఏడ్చేడ్చి మా అమ్మ అంత గోల చేసింది కదా. నాన్నకోపం వచ్చి "కొత్తగా పెళ్ళయి అత్తారింటికెళ్ళే ఆడపిల్లలా ఏవిటా ఏడుపు అసయ్యంగా" అని కేక లేసే వరకూ రిక్షానే ఎక్కలేదు. మరి ఆ ఏడుపంతా ఏ చెట్టెక్కిందో రైలు కదలగానే నాన్నతో కబుర్లేసుకుంది.

"బెజవాడిల్లు ఎంతుంటుందీ ? ఎన్ని వాటాలున్నాయీ ? ఇంటి వాళ్ళకెంతమంది పిల్లలూ?" అంటూ . ఇన్ని విషయాలు నాన్నకి మాత్రం ఎలా తెలుసు ! అసలా ఇల్లు తను చూసి కుదిర్చేస్తే కదా ! మాకు ప్రభాకరం అన్నయ్యని ఓ చుట్టం ఫ్రెండున్నార్లే ! ఆయన కుదిర్చారు వాళ్ళింటి పక్క ఇల్లు.

ప్రభాకరం అన్నయ్యా నాన్నా ఎన్నో ఏళ్లనించీ ఈ కంపెనీలోనే కదా పని చేస్తున్నారు. ఇద్దరూ ఒకే రోజున వుద్యోగాలలో చేరారుట. కాపోతే ఆయనకి ఆఫీసులో పని. మా నాన్న

లాగా ఎండకెండి వానకి తడవక్కర్లా. విశాఖపట్నంలో ఏరోడ్రోము కట్టినా గన్నవరంలో బ్రిడ్జి కట్టినా వుద్యోగం ఒకచోటే. ఇళ్లూపక్కపక్కనే. అందుకే అమ్మకీసావిత్రొదినకీ కూడా చాలా స్నేహం. ఏవిటో పాపం నాన్న వుద్యోగం, స్నేహాలన్నీ మర్చిపోతూ వుండాలి. మళ్లీ గుర్తు చేసు కుంటూ వుండాలి. అయినా అమ్మ చెప్తూ వుంటుందిగా ! నాన్నకి అసలు నిజం స్నేహితులు ముగ్గురేట. ఇసికా, సిమెంటూ, కంకరానూ ! అవి ఏవూరు వెళ్లినా తప్పవుగా ! కానీ మాకలా కుదరదే. ఇంక ఇప్పటి క్కూడా పాపక్కా ప్రమోదక్కా కల్లోకొస్తూనే వుంటారు. ఇంక బెజవాడెళ్లి పోయాక సువర్ణ కూడా వస్తుంది మరి !

రైలు అలా వెళ్లగా వెళ్లగా ఏలూరు స్టేషనొచ్చింది. చంద్రావు పరుగు పరుగున వచ్చి సామానందించాడు. మూడు జాడీలు, దేవుడి బుట్టా, రెండు ఫాన్లూ, చాకలాడింట్లో వుండి పోయిన బట్టలూ పరుపులూ, తన సొంత డబ్బుతో వసంత మహల్ కారప్పూస గులాబి జాంలూ కొనుక్కొచ్చి మరీ ఇచ్చాడు. నాకు పాపం బోల్డు జాలేసింది. వుత్తి పుణ్యానికే ఏదో ఒకటనేదాన్ని. ఇంక బెజవాడలో సైకిలెక్కించి మమ్మల్నెవరు తిప్పుతారు ! ఏవరు పేట దాకా వచ్చి అందరికీ టాటా చెప్పి దిగిపోయాడు. అమ్మ తను కొవ్వూరొచ్చేటప్పుడు చెప్పి వచ్చిందిట. ఈ సామానంతా లక్ష్మివారం మధ్యాహ్నం బండికి తెచ్చిమ్మని !

బెజవాడ దగ్గిరపడేకొద్దీ రైలుపెట్టంతా వేడెక్కిపోవడంమొదలెట్టింది. చెక్కకిటికీలు మూసేస్తే చీకటిగా బానే వుంటుంది. కానీ ఒకటే వుక్క ! కిటికీలు తీసేస్తే వడగాలి. ఎలాగో చచ్చీ చెడీ రైలు బెజవాడ చేరింది.

అందరంరైలు దిగేటప్పటికి మట్టిమొఖాలూ రేగిపోయిన జుట్లూ అడుక్కునేపిల్లల్లా వున్నాంట. అమ్మ చెప్తే తెలిసింది. ఓ పక్క కూలాళ్లూ, ఇంకో పక్క రిక్షావాళ్లూ నిలబడనివ్వరు. పద్దెనిమిది సామాన్లూ లెక్కెట్టుకుని ఎంతసేపు కూచున్నా ప్రభాకరం అన్నయ్యా కనబడడు. జీపూ కనబడదు. ఎంతసేపని ఎదురు చూస్తాం ఎవరో వస్తారని ! అక్కడికీ రిక్షావాళ్లని అమ్మ బతిమాలింది కూడాను ''మా చావు మమ్మల్ని చావనియ్యండి నాయినా'' అని. కానీ వాళ్లెందుకు అలా ఒప్పుకుంటారు ? వాళ్లు పెట్టే బాధ భరించలేక నాన్న అప్పుడు బయట పెట్టారు. లక్ష్మి వారం ప్రయాణం అంటే ఫ్రైడే అనుకుని అలా రమ్మని రాసారుట ప్రభాకరం అన్నయ్యకి. పైపెచ్చు అమ్మని తిట్టడం. గురువారాన్ని పట్టుకుని లక్ష్మివారం అనడం ఎందుకూ ! వెధవ కన్ఫ్యూజనూ అని, ఎక్కడ అమ్మ తన్ని తప్పు పట్టేస్తుందేమోని ముందే గయ్ గయ్మనేస్తారు అమ్మ మీద.

ఇంక అసలు విషయం తెలిసిందిగా. జీపు రాలేదని వెనక్కెళ్లిపోలేం కదా. చివరికి రిక్షా వాళ్లే గెలిచారు. మొత్తం నాలుగూ, నాకూ, నాన్నకీ, చిన్నారికీ అమ్మకీ తలొటీ. నా రిక్షాలో

పరుపులూ బుజ్జీ, అమ్మ రిక్షాలో ఆవకాయి జాడీలూ దేవుడి బుట్టా, నాన్న రిక్షాలో ఫాన్లూ ఇందూ, ఇంక చిన్నారికి మిగిలిన సామాన్లూ. అలా మాంఛి ఎండలో నాలుగు రిక్షాలూ పెళ్లి వారూరేగింపులా గవర్నరుపేట చేరాయి.

సోడా కొట్టు దగ్గిరాపారు. అందరూ తలాసోడా తాగుతున్నాం. అప్పుడూ రిక్షావాళ్లు ''గవర్నరు పేటొచ్చేసిందండీ, ఏ వీధండీ ! ఎవరింటికెళ్లాల'' అని అమ్మనడిగారు. అమ్మ నాన్నకేసి చూసింది. గుర్తుకొచ్చింది నాన్నకి తను ఎడ్రసు చెప్పాలని.

''నాకేం తెలుసే ! ప్రభాకరం కదా ఇల్లుకుదిర్చింది. వాళ్లింటి పక్కనే వున్న బాగా డబ్బున్న బట్టలకొట్టు వాళ్లదిట. స్టేషనుకి వస్తాడు కదా అనుకున్నా!''

అమ్మకి గాభరా పట్టుకుంది. ''ఇప్పుడెలాగండీ బాబూ ! డబ్బున్న వాళ్ల ఇల్లంటే రిక్షా వాళ్లకెలా తెలుస్తుందీ ? ఇల్లు గలాయన పేరు గుర్తుకి తెచ్చుకోండి'' అని నాన్నకి వుపాయం చెప్పింది.

నాన్న నెమ్మదిగా ఆలోచించి గాపకం తెచ్చుకుని చెప్పారు. ''కొంచెం గుర్తొస్తోందే! ఆయన పేరు సుబ్బారావో ! సుందర్రావో అనుకుంటా.''

''ఇంటిపేరు?''

''ఇంటిపేరూ! ఇంటిపేరూ!... ముక్కల పులుసో పప్పు పులుసో అనుకుంటా కాదు కాదు పులుసు పచ్చడి'' ఇంక మేమంతా సోడా తాగుతూ నవ్వేటప్పటికి ముక్కుల్లోపలి కెళ్లి పోయి నానా హైరానా పడ్డాం. ఇలాటి నాన్నతో అమ్మ కాబట్టి వేగుతోంది గానీ ఇంకోళ్ళయితేనా!

''ముక్కల పులుసేవిటీ ! ఎండకి మతిగానీ పోయిందా ? లేపోతే ఇంకా పెళ్లి భోజనాల మనసు తీరలేదా ?''

''కాదే ! ఎవర్నన్నా అడుగుదాం. పులుసు పచ్చడో పప్పు పులుసో అయి వుంటుంది''

తిరిగి తిరిగి రెండుమూడు సోడా కొట్లలో అడిగాం. మేం సోడాలు మీద సోడాలు తాగడవే గాని ఎవరిల్లు కావాలో మాకే తెలియకపోతే ఇంక చెప్పే వాళ్లకేం తెలుస్తుందీ ! ఓసారి రామారావంటారు ఓసారి సుబ్బారావంటారు. ఇంటిపేరడిగితే ఓసారి ముక్కల పులుసంటారు. ఓ సారి పప్పు పులుసంటారు.

ఎంతైనా పాపం అమ్మమ్మ వారం వర్జ్యం చూసుకునే రైలెక్కించింది కదా ! ఆ మాత్రం దేవుడు కాపాడ్డూ ! ఒక పేద్ద వేపచెట్టూ వెనకాల ఓ చిన్న పెంకుటిల్లూ కనిపించాయి. అవి చూడగానే అమ్మకి ఓ అయిడియా వచ్చింది.

''మీరు చేసిన ఘన కార్యానికి నేనూ పిల్లలూ ఇదిగో ఈ చెట్టుకిందుంటాం. తమరో

రిక్షాలో వెళ్లి ఆఫీసు కనుక్కొని ఆ ప్రభాకరాన్ని పట్రండి. మీకు నిద్దట్లోనయినా ఆఫీసు ఎడ్రసు సరిగానే గుర్తు వుంటుందిగా!'' అని నాన్నని కేకలేసింది.

''లక్ష్మీ టాకీసు పక్క సందులోనే పెద్ద బిల్డింగు అద్దెకి తీసుకున్నారుగా ! అయినా కంపెనీ బోర్డుంటుందిగా. ఎక్కువ కష్టపడక్కర్లేదు'' అని మహా సంతోషంగా ఈలేసుకుంటూ ఓ రిక్షా ఎక్కి వెళ్లిపోయారు మా అందర్నీ చెట్టు కిందొదిలేసి.

మమ్మల్ని చూసేటప్పటికి అమ్మకి కడుపు తరుక్కుపోయినట్లుంది. తిట్టకుండా కూచోబెట్టి నారింజపండు వల్చి తొనలు పెట్టింది. బెల్లం ముక్క బుగ్గన పెట్టుకోమంది. కానీ ఏవిటో ఎన్ని చేసినా మంచినీళ్లు తాగితే గానీ నాకు దాహం తీరినట్లు అనిపించక కూజా పుచ్చుకు బయల్దేరాను ఆ పెంకుటింటి వాళ్లనడిగి కాసిని మంచి నీళ్లు తెచ్చుకుందామని. మహా అయితే మధ్యాహ్నం నిద్దర్లేపినందుకు విసుక్కుంటారు. అంతకన్నా జైల్లో అయితే ఏం పడేయరు కదా! నెమ్మదిగా తలుపు తట్టా.

ఒకావిడ అమ్మంతే వుంది. ఎవరూ అంటూ తలుపు తీసి నన్నూ నా చేతిలో కూజానీ చూసింది. ''ఎవరూ ! ఏవే ! నువ్వు నానీవి కదూ. మీ అమ్మేది ? మిగతా వాళ్లేరీ ? లోపలికి రాకుండా ఏం చేస్తున్నారూ ?'' అంటూ గబగబా వాకిట్లోకొచ్చి చూసింది.

''సరోజమ్మా ! ఏవిటీ రాక ? ఈయనేవిటీ నాకలా చెప్పారూ ? రేపు కదూ మీరొచ్చేదీ? ఎంత ఎండ ? రండి రండి లోపలికి రండ''ని తీసికెళ్లింది. మేమంతా లోపలికెళ్లి బావిలోంచి చల్లటి నీళ్లతో మొఖాలు కడుక్కుని మామూలు పిల్లల్లా అయే లోపల కుంపటంటించి ఉప్మా చేసి పెట్టింది. అమ్మకి కాఫీ ఇచ్చింది. మేం అంతా హాయిగా కబుర్లు చెప్పుకుంటుంటే అప్పుడొచ్చారు నాన్నా ప్రభాకరం అన్నయ్యా వాకిట్లో రిక్షా లేవయ్యాయో అనుకుంటూ !

ఇంతకీ మాకోసం కుదిర్చింది వీళ్ళింటి పక్కనే వున్న మూడంతస్థుల మేడలో ఓ పక్క వరుస నాలుగ్గదుల వాటా ! ఎప్పట్లానే వీళ్లూ డబ్బు కోసం కాదుట అద్దెకిచ్చింది. మరెందుకంటే లంకంత ఇంట్లో ఆవిడొక్కరూ వుండాల్సొస్తోంది. నలుగురు పిల్లలయితే ఇల్లు సందడిగా వుంటుందనిట. మరి నలుగురు పిల్లలుంటే ఎన్ని లాభాలున్నాయో ? ఇంతకీ మా ఇల్లు గల చాలా చాలా డబ్బున్న ఆయన పేరేవిటంటే... పచ్చి పులుసు సుబ్బారావుగారుట. మా నాన్న తన మతిమరుపుతో మమ్మల్నెలా కాల్చుకుతిన్నారో కదా పాపం !